మిస్తున్న కొద్దీ, విజ్ఞాన భాండారం పెరిగి పెద్దదవుతున్న కొద్దీ, నూతన వ్యవస్థలు, నూతన ప్రమాణాలు పుట్టుకొస్తవి. ఏ వ్యవస్థకయినా ఏ ధర్మానికైనా, ఒకటే పరీక్ష—అది నిలకడగా ప్రచారంలోవున్న శాంతిసమయం తిరిగి వచ్చినప్పుడు ఆ వ్యవస్థకూడా ప్రపంచంలో, మానవ హృదయాల్లో స్థావరమేర్పరచుకుని తిరిగి రావాలి. అలా రాలేనప్పుడు ఆ సాంఘికవ్యవస్థ అసంపూర్ణమైనదన్నమాటే. అది కాలానుగుణంగా మార్పు చెందవలసిందే. ఆర్యులనాటికిమల్లే వివాహసంస్థ నేటికీ ఉండాలంటే అది అసంభవం. రాజకీయ వ్యవస్థ ఆరోజుల్లోవలె వుండాలంటే జరగనిపని. వాటికీ, నేటికీవున్న వ్యత్యాసం సర్వజనవిదితమే.

ఇంకొకవిషయం నిష్పాక్షికంగా నివారించుకోవాలి- మనమింతగా ఆందోళన పడుతున్న నేటివ్యవస్థలోద్భవించిన విజ్ఞానసంపత్తి యింత కొద్దికాలంలో- దాదాపు ఒకశతాబ్దం ఎప్పుడూ కలుగలేదు. మరి ఈ శతాబ్దపుటాదినుండి కలిగిన వైజ్ఞానికపురోగమనం మరిఎప్పుడూ యింతకు ముందు జరిగివుండలేదు. మానవ చరిత్రకు, విజ్ఞానానికీ, సంస్కృతికి నూతనార్థాన్నిచ్చి సరిక్రొత్త స్వరూపంలో సమర్పించిన మార్క్సిస్టు సిద్ధాంతం నేటియుగం పెట్టిన భిక్షే-అని ఒప్పుకుతీరాలి. అది మంచిదయినా, కాకపోయినా మానవ ప్రవృత్తిని అతడి చరిత్రను పరిశీలించడంలో మార్క్సు సిద్ధాంతం నూతన దృక్పథాన్ని ప్రవేశపెట్టింది. అది అభ్యుదయ సూచనే.

ఎంతవైజ్ఞానికపురోగమనం కలిగితేనేం, నైతిక విలువలు నశించిపోయి, మానవత్వమే మరుగున పడి, హింస ప్రబలిపోయి, మానవాస్తిత్వానికే అఘాతంకలిగేటట్లుగా వున్నదని నేడు అనేకులు భయపడుతున్నారు. ఇలాంటి భీతి ఎప్పుడు అశాంతికలిగినా మానవుడనుభవిస్తూ వచ్చిందే- "దీనికి కారణం-" తమకు తెలియకుండా పరిస్థితులు తమచే నడిపించుతున్న ఈ మహావిప్లవాన్ని చాలా కొద్దిమంది గమనించి తదనుగుణంగా నడచుకుంటారు. అలా కాలగతిని గుర్తించి, దానికితోడ్పడి శాంతి సమయాన్ని సన్నిహితంగా తీసుకువచ్చేవారే మహాత్ములు, మహానాయకులు, సామాన్యమానవుడు తన పాత్రను అజ్ఞాతంగా నిర్వహిస్తాడు. తమకీ మహావిప్లవంలో యింతపాత్ర వున్నదంటే నమ్మలేరు కొందరు.

మానవుడెప్పుడూ సామరస్యానికే పాటుపడుతుంటాడు. ఒకప్పుడు తన శక్తినంతా వినియోగించి, సర్వతోముఖమైన విలక్షణమైన సంస్కృతి కారకుడై నేడు తన గోతిని తానే త్రవ్వుకుంటూడనుకోవడం పొరపాటు. మానవుని ప్రవృత్తి పురోగమనం. అతడభ్యుదయశీలి. ఈ క్రాంతి మార్గంలో అతడు విజయుడు అయితీరుతాడు.

---

కథానిక

# మధ్యవర్తిత్వం

తాళ్లూరు నాగేశ్వరరావు

ఇంతకాలానికి రమణయ్యకు మళ్ళా సంతానం కలిగిందట. పదేళ్ల తరువాత కొడుకుపుట్టాడట. మా ఆవిడ చెప్పింది. నాకు నిజానికి పట్టరాని సంతోషమే కలిగింది. ఎంచేతనంటే నాతో రమణయ్య "తనకు కొడుకు పుట్టడం కంటే జీవితంలో తృప్తిచెందతగ్గ అనుభవంలేదు"అని చాలా సార్లు అనటం జరిగింది. కాని ఇది పన్నెండేళ్ళకు పైమాట. అప్పటికే రమణయ్యకు తొమ్మిదేళ్ళ కూతురు ఉంది. చక్కని బొమ్మ. తల్లిదండ్రుల పంచప్రాణాలూ ఆ పిల్లను సక్రమ పద్ధతుల్లో పోషించడంలో ఉండేవి. కూతురైనా కొడుకులాగే భావించుకొని మురుసుకొనేవాళ్లు. రమణయ్య కోరిక భగవంతుని కృపవల్ల ఇన్నాళ్ళకు అక్కరకు వచ్చింది.

"పిల్లవాడు ఎవరి పోలిక?" అన్నాను మా ఆవిడతో.

"తండ్రిపోలికే!"

"అట్లయితే రమణయ్య సంతోషానికి హద్దూ ఆపూ ఉండకపోవచ్చు" అన్నాను ఆనాటి రమణయ్యను గుర్తుకు తెచ్చుకుంటూ.

మా ఆవిడ చిన్నగా నవ్వి, "పిల్లాకు పుట్టడం తోటే తల్లీ, తండ్రీ మంచాలు పట్టారు" అన్నది.

నాకు ఆశ్చర్యం వేసింది. ఆ దంపతుల మనస్తత్వంలో కలిగిన మార్పు అంతుపట్టలేదు.

"ఏం? ఎందువల్ల?" అన్నాను ఏమి తెలీని వాడిలా. మా ఆవిడ విసుక్కుంది, ఇంత విషయం జీవితాల్లోని అనుభవాలను అవగాహన చేసుకున్న నాకు తెలీక పోవటాన్ని.

కాని తీరా వెనక్కు మళ్ళి ఆలోచనచేసి విచారిస్తే యధార్థం నాకూ బోధపడింది. మా ఆవిడ చేత చెప్పించుకొనే అగత్యం లేకుండా. "పాపం రమణయ్యా! ఎంత దుస్థితి పట్టింది!" అనిపించింది మనస్సుకు.

నాకు తెలిసిన చాలామంది వ్యక్తుల్లోలేనికొన్ని విశేషాలు రమణయ్య మనస్తత్వంలో వున్నవి. ఆయన భార్యకూడా ఏమంత తెలివితేటలు కలది కాదు, ఎదుటివాళ్ళ గౌరవాన్ని పొందేందుకు ఇద్దరూ తాపత్రయం పడేవాళ్ళే కాని, ఆ విషయంలో ఇద్దరూతొక్కే వక్రమార్గం ఒకటుంది. ముందుచూపులేదు. ఈ ముందుచూపు లేకపోవడంవల్ల యేర్పడిన దుస్థితికి ఇద్దరూ సరిసమానంగా బలికావడంలో వింత ఏమీలేదు. తరువాత తమ తెలివి తక్కువయొక్క ఫలితం అనుభవానికి వొచ్చినప్పుడు-దంపతులిద్దరూ దుఃఖంతో కుమిలిపోతున్నారని తెలిశాక నా మనస్సు కాస్త చలించక మానలేదు. పరిస్థితుల ప్రాబల్యంవల్ల ఒక వ్యక్తి బలవంతాన తప్పుదారిలో నెట్టబడటంలోనూ, ఆ పైన కొన్ని చిక్కులకు లోనుకావటంలోనూ కొంత అర్థంవుంది. కాని, స్వయంగా చిక్కుల్లో యిరుక్కొని వెనక్కు తిరిగి చూచుకొని పశ్చాత్తాపపడడం-జ్ఞానంలేనివాళ్లు చేసే పని, రమణయ్య జ్ఞానంలేనివాడనికాదు.

ఏ విధంగా చూచుకున్నప్పటికీ రమణయ్య నాకు బంధువు కాదు కాని, ప్రాణమిత్రుడు మా స్నేహానికి మొదలు బాల్యం. వాళ్ళ యింట్లో నాకున్న చనువు అప్పటికీ యిప్పటికీ ఏంతగ్గలేదు. అవసరం వొచ్చినప్పుడు రమణయ్య నానుంచి సలహాలు తీసుకోవడంకూడా కొత్తకాదు. అయితే అంతఅవసరం రమణయ్యకు ఎప్పుడోగాని కలుగదు. సాధ్యమైనంతవరకూ తనస్వంత ఆలోచన ప్రకారం పోయేమనిషి.

రమణయ్యకూతురు శ్యామల ఎదిగి పెళ్లీడుకు వొచ్చింది. ఇంత ఉండికూడా కూతుర్ని ఎక్కువ చదువులకు పంపకపోవడంలో ఆయన్ని మనం తప్పుపట్టనవసరంలేదు. ఆడవాళ్ళ చదువువిషయమై ముందుముందు వాళ్ళ శీలాల్లో నమ్మశక్యంగాని మార్పులు జరగబోతవేమో అని యోచించే అపోహలు కల్పించుకొని వెనుకాడే చాలామంది వ్యక్తుల్లాగా రమణయ్యకూడా వెనుకాడినాడని చెప్పవలసిన అవసరం ఉందిమరి. సంస్కారం అనేది మనకు తెలీకుండా మనలో కలగాలిగాని బలవంతాన రుద్దుకుంటేరాదు.

రమణయ్య తనకూతురు పెళ్ళిచేయాలని తల పెట్టటంతో చాలా సంబంధాలు ఆయన కాళ్ళ దగ్గరకు నడిచి వొచ్చాయి. చిత్రమేమిటంటే ఆయన కూతురు అందచందాలు చూచి కాదు, ఆయనకున్న ఆస్తినిచూసి. చివరకు ఒకసంబంధం స్థిరపడింది. కూతురుకు పెద్దయెత్తుగానే కట్నం యిస్తున్నాడట. అవతలవాళ్ళకు యాభైఅయిదు ఎకరాల మాగాణీ, ఆయిదెకరాల బంగారంపండే పసుపుతోట ఉన్నాయట. ఎంతచెట్టుకు అంత గాలి కొండొద్దూ!

"ఇంతకట్నం ఇవ్వటంలో నీ ఉద్దేశ్యమేమిటి రమణయ్యా!" అన్నాను ఎక్కువ కట్నాలిచ్చి-కలవారియింట్లో పిల్లనిచ్చినప్పటికీ ఆ పిల్లసుఖపడక పోగా- నరకయాతనలు అనుభవించిన ఉదాహరణలు జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

"ఏంలేదు. నాకు కొడుకైనా, కూతురైనా ఆమేగా." తేలిగ్గా అన్నాడు రమణయ్య.

"ఇకముందు పిల్లలు పుట్టరనే..." గొణిగాను. నాఅవివేకానికా అన్నట్టు బిగ్గరగా నవ్వి వెళ్ళి పోయాడు.

తరువాత రమణయ్య కూతురుపెళ్లి ఊళ్ళో పావుకాళ్లకు తలవంపులు గలిగేటట్టు—చాల గొప్పగా నలుగురూ మెచ్చుకొనేటట్టు చేశాడు. పెళ్లికి నాకు పెత్తనంకూడా ఇచ్చాడు. ఏమైనా రమణయ్య పద్ధతినాకు అప్పట్లో నచ్చలేదు. ఆయన నన్ను ప్రత్యేకించి సలహా అడక్క పోవడంచేత "ఇది పద్ధతికాదు" అని వేలెత్తి చెప్పే ధైర్యంనాకు లేకపోయింది. ఊళ్ళో పెద్ద మనుష్యులు రమణయ్య కొనియాడటమూ ఆయన ఉప్పొంగి పోవడమూ చూస్తున్నకొద్దీ

నాకు జాలీ-కోపమూ, అసహ్యమూ వేసినయ్. ఈ పెళ్ళి రమణయ్య నిరంకుశత్వంమీద జరిగిందో భార్య అంగీకారంమీదకూడా ఆధారపడి జరిగిందో తెలుసుకోవాలనే కోరిక కలిగి, ఆమెను అడిగాను. ఈ మూఢత్వం యీమెదాకా ప్రాకిందని ఆవిడ యిచ్చిన సమాధానంవల్ల తెలుసుకుని "కందకులేని దురద..."అన్న సామెతను గుర్తుకు తెచ్చుకొని మెదలకుండా వూరుకున్నాను.

ఆపైన ఒకటి రెండు సంవత్సరాలు గడిచాక అమ్మాయి మంచికటుంబలోనే పడిందని తెలుసుకున్నాక, రమణయ్య తన భుక్తికి మూడెకరాలు అట్టేపెట్టుకొని మిగతాది కట్నంక్రింద వ్రాసి ఇచ్చాడు. ఇప్పుడుగాని నిద్రపట్టినట్టు లేదు.

కాని ఇప్పుడు ఏమనుకొనిమట్టుకు ఏంలాభం? రమణయ్యగీత అట్లావుంది. మళ్లీ తనకు సంతానం కలుగుతుందని కలగన్నాడా? ఎంత పశ్చాత్తాపపడితేమటుకు ఊళ్ళో వాళ్లు నవ్వకుండా ఉంటారా?

దంపతులిద్దరూ మంచాలుపట్టారని తెలిసి, ఇద్దరకూ ధైర్యం చెప్పాలని ఆ సాయంత్రం రమణయ్య యింటికేసి వెళ్ళాను.

ఇంకా సాంతం చీకటిపడలేదు. ఇంట్లో దీపాలు వెలిగించబడలేదు. రమణయ్య భార్య పిల్లవాడి ప్రక్కన పండుకొని ఉంది. పురిటిగదిలో రమణయ్య వరాండాలో పడకకుర్చీలో చేరగిలబడి ఏదో ఆలోచిస్తున్నవాడల్లా నన్ను చూసి లేచాడు.

"ఏమిటి రమణయ్యా! మరీబొత్తిగా అగుపడటంలేదు. మనిషివి అట్లా పీల్చుకుపోయావేమిటి?" అన్నాను సూటిగా జవాబులు లాగాలని.

రమణయ్య కొంచం కలవరపడ్డట్టున్నాడు. "ఆఁ! ఏంలేదు" అని తప్పించుకోవాలని చూశాడు. కాని నేను వొచ్చింది అసలు విచారానికి ముఖ్య హేతువు తెలుసుకొని, ఓదార్చాలనిగా.

"కాని రమణయ్యా! నువ్వేమన్నా అనుకో. కూతురు విషయంలో నువ్వు అవలంభించిన పద్ధతి మంచిదికాదని అప్పుడూ చెప్పాను; ఇప్పుడూ చెపుతున్నాను. మనం కలలోకూడా తలచని అనేక విషయాలు జరగటానికి అవకాశం వుందని గుర్తించి వ్యవహరించటం విజ్ఞులలక్షణం. అయినా ఇప్పుడు ఏంచేస్తాం? మంచాలను అంటుకుపోయి మట్టుకు ఏం లాభం? ధైర్యంగా ఉండు. పిల్లవాడు బ్రతికి బాగుండాలేకాని ఆస్తి ఒక లెక్కలోదా!" అన్నాను.

రమణయ్య వింటూ కూర్చున్నాడు. రమణయ్య భార్య మెల్లగా మంచంమీదనుంచి లేచి తలుపుపక్కన ఒచ్చి కూచుంది.

"ఒంట్లో బాగుంటున్నదమ్మా!" అన్నాను ఆవిడతో.

"ఊఁ!" అన్నదావిడ. ఉత్సాహంలేదు.

"పిల్లవాడి ఆరోగ్యం—"

"ఊఁ!"

ఆ దంపతుల్ని ఓదార్చే తీరు నాకు తెలియలేదు. వాస్తవానికి వాళ్ళు తాము అధికమైన కష్ట పరిస్థితిలో ఉన్నట్టు బాధపడటం నాకు రోత నిపించింది. అది కేవలం కొనితెచ్చుకొంటూన్నట్టు నాకు తోచింది. వాళ్ళ స్థితి చూస్తున్నకొద్దీ నా ఓదార్చే పద్ధతి వాళ్ళకు బాధని ద్విగుణీకృతపరుస్తున్నదేమోనన్న భయం పట్టుకుంది.

"రమణయ్యా! నువ్వు మగవాడివి. నువ్వే అట్లా మునగదీసుకొని పండుకొంటే ఆడకూతురు మనస్సు ఎట్లా ఉంటుంది? నువ్వు ధైర్యం చెప్పాల్సిందిపోయి అట్లా నీలుక్కుపోతే ఏమైనట్టు. అల్లుడు మంచివాడే కనుక, నీ స్థితిని ఎరివాడై దయతలచకపోడు." నామనస్సులో ఉన్న సంగతిని ఆ చివరి వాక్యంలో వెళ్ళగక్కాను. రమణయ్యలో కాస్త చలనం కలిగింది.

"మనం అంత పరువుతక్కువ వాళ్ళమా— "దేహి"అని అడగటానికి" అన్నాడు రోషం తెచ్చుకొని.

"చింత చచ్చినా పులుసు చావలేదు. వాళ్లు దయతలచటం దేహి అనటంతోసమా? వాళ్ళే కనుక మర్యాద తెలిసిన వాళ్ళయితే నిజంగా నీ స్థితిని గమనించకపోరు. అయిందేదో అయిపోయింది. నలుగురూ నవ్వటంకూడా సద్దుమణిగింది. అల్లుడు మళ్ళా తిరిగి పొలం వ్రాసి ఇస్తానని అనేపక్షంలో నువ్వుమాత్రం మునుపటి మూఢప్రవర్తన ప్రవర్తించవద్దు ఇందులో మనకు గౌరవం పోయేందుకేమీ లేదు" అన్నాను నా సలహాగా.

ఈ సలహా రమణయ్యకు అట్టే నచ్చలేదు. కాని రమణయ్య భార్య తల ఆడించింది. ఆవిడకు ఇంతకంటే ఉత్తమమైన పద్ధతి తోచలేదు.

"నువ్వు అన్నది రైటన్నయ్యా!" అన్నదావిడ.

నేను కొంచంసేపు కూర్చుని ఇంటికి వచ్చేశాను.

మరునాడు రమణయ్య కూతురు శ్యామల అత్తవారి యింటిదగ్గర్నుంచి తమ్ముణ్ణి చూసేందుకు వచ్చినట్టు నాకు తెలిసింది.

* * *

అవసరమైన పనివుండి నేను తెనాలి వెళ్ళడం జరిగింది. కావలసిన మనిషికోసం తిరిగితిరిగి సాయంత్రమైనా ఆ మనిషి దొరక్కపోవటంచేత విసిగి వేసారి ఏంతోచక కాస్త కాఫీత్రాగి కొంచం సేపు విశ్రాంతి తీసుకుందామని హోటల్లోకి వెళ్ళాను. ఫలహారం తిని, కాఫీ తీసుకొంటూండగా వెంకట్రావు కనిపించాడు. నా ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"ఏమండీ?" అని నన్ను పలకరించినాడు.

"ఎక్కణ్ణుంచి రావటం? అందరూ బాగున్నారా?" అన్నాను మర్యాదకు ప్రతిమర్యాదగా. ఇంతకూ ఆ వెంకట్రావు ఎవరని చెప్పటం మరచాను. రమణయ్య అల్లుడు. అతన్ని చూడటంతో కాకతాళీయంగా నాలో ఒక ఆలోచన రేగింది. రమణయ్య ప్రస్తావన తెచ్చి మాట్లాడదామని తను అనవసరంగా కానివిషయాల్లో జోక్యం కలుగచేసుకొని-తనపట్ల వెంకట్రావుకున్న కాస్త గౌరవాన్ని తొలగించుకుంటున్నా నేమోనన్న భీతి పట్టుకున్నది కానీ, రమణయ్య నా ప్రాణమిత్రుడు కావటంచాతనూ, ఆయన క్లిష్టసమస్యల్ని పరిష్కారం చేయవలసిన అగత్యం నాకు ఉంది కనుకనూ, గుండె దిటవుచేసుకొని అన్నాను.

"అయితే అబ్బాయీ! బావమర్ది పుట్టినా చూచేందుకు మా వూరు వచ్చినట్టులేదే. అంత తీరని పనులేమిటి?" ముందర కాళ్ళకు బందాలు వేశాను.

"ఆఁ!..." ఏదో గొణిగాడు.

"కోపగించుకోకండా ఉంటే నీనుంచి కొన్ని విషయాలు తెలుసుకోవాలని కుతూహలపడుతున్నాను. నీకు అవసరమైన పనుంటే చెప్పు. మరొకప్పుడు తీరిగ్గా మాట్లాడుకోవచ్చు. పెద్దవాణ్ణి నిన్ను పరీక్షిస్తున్నానని, నీ మనస్తత్వ పరిజ్ఞానాన్ని బయటికిలాగుతున్నానని కలలోకూడా తలచవద్దు" అన్నాను తాపీగా.

వెంకట్రావు ముఖంలో కొద్ది మార్పులు రావటం గమనించాను. "ఏమిటీ తగలాటం?" అనికూడా అనుకోవచ్చు. కాని మర్యాదకు కట్టుబడిపోయినాడు. పైకి నిర్మలంగా కనపడసాగాడు.

"మీరు ఏదో కొత్తగా మాట్లాడుతూన్నట్టుంది." ముఖమాటపడ్డాడు.

"ఏమీలేదు. రమణయ్యగారి పరిస్థితిని గురించే కొంచం మాట్లాడాలనే బుద్ధిపుట్టింది. పిల్లవాడు కలిగింతరువాత వాళ్ళలో వొచ్చిన మార్పు నీకు తెలిసేవుంటుంది కనుక ఎక్కువ చెప్పనవసరంలేదు. ఆ మార్పుకుగల కారణాల్ని గురించే నీతో చర్చించ దలచుకున్నా. కావటానికి రమణయ్య స్నేహితుడే అయినా ఆయన మానసిక పరిణామం నాకు తెలిసినట్టు, నేను కనిపెట్టినట్టు మరెవ్వరూ కనిపెట్టలేదని నాకు విశ్వాసం ఉంది. రమణయ్య వొట్టి బోలుమనిషి. హృదయం నిర్మలంగా ప్రవహించే నదిలాంటిది. పరిస్థితులకు చాల సుళువుగా లొంగిపోతాడు. భవిష్యత్తును గురించి చింతలేదు. ఆలోచనలేదు. నీకుఉన్న పొలాన్నంతా కట్నం క్రింద ఇవ్వటంలోని పొరబాటు ఆనాడు నాబోటివారి ప్రబోధంవల్ల తెలుసుకొని రమణయ్యకు ఈనాడు తెలిసిరావటం ఆయన తెలివి తక్కువ తప్ప మరొకటి అని నిర్ధారణ చేసేందుకు లేదు. అయినా భగవంతుడు ఆయనపట్ల లేడు. ఒక కొడుకు గలిగాడు. వాడిభవిష్యత్తు నీమీద ఆధారపడి ఉంది." చివరివాక్యం నొక్కిచెప్పాను.

వెంకట్రావు ముఖంలోకి చూశాను, కావలసిన మార్పులకోసం. కాని వెంకట్రావు తొణక్కపోవడం, పైపెచ్చు హాయిగా చిరునవ్వునవ్వి ఊరుకోవడం నాకు నా మోషీ అనిపించింది. హృదయం గతుక్కుమంది. ఇంతా నోరువిప్పి చెప్పినాక అది కేవలం వృధా కావటం నాకు సుతరామూ ఇష్టంలేదు.

"ఇదిగో అబ్బాయీ! నువ్వేమీ లేనివాడవు కాదు నీమామ ఆస్తి నిజంగానీకు అవసరంలేదు గౌరవానికి పుచ్చుకున్నావు-అంతే. కథ అడ్డం తిరిగింది కనుక నీవు మళ్ళీ నీ మామగారి ఆస్తి యిచ్చివేయటం- కనీసం కొంతయినా; ధర్మం

ఏదో పెద్దవాణ్ణి-తెగించి చెపుతున్నాను. ఇందులోని స్వార్థం ఏంలేదు. నీ ఇష్టం" అన్నాను,

"సరే. ఆలోచిస్తాను" అన్నాడు వెంకట్రావు.

అంతే. తృప్తిపడ్డాను. చివరకు ఆమాట అనిపించుకో గలిగాను. నా ఉపన్యాసం వృథాగాదని, నా మధ్యవర్తిత్వం అక్కరకు వొస్తుందని విశ్వసించేందుకు ఆమాట చాలును. ఇద్దరమూ కాఫీత్రాగి బయటికొచ్చాము.

"వెళ్ళొస్తానండీ" అన్నాడు వెంకట్రావు.

"మంచిది" అన్నాను.

అతను అటువెళ్ళాడు. నేను కావాల్సిన మనిషి కోసం అన్వేషణ జరిపేందుకు పార్కు కేసి వెళ్ళాను.

* * *

కొన్ని పనుల్లో చిక్కుకొని ఉండటంమూలాన నాకు రమణయ్య ఇంట్లో పరిస్థితుల్ని యెప్పటికప్పుడు కనుక్కొనే అవకాశం లేకపోయింది. అయినా కొద్దోగొప్పో తెలుస్తూనే ఉన్నాయి. మా ఆవిడవల్ల. పదిరోజులక్రితం వొచ్చినకూతురు రెండుమూడురోజులుండి తరువాత అత్తగారింటికి వెళ్ళిందట. తల్లిదండ్రులకూ ఆ పిల్లలకూ జరిగిన సంభాషణల వివరాలు నాకేం తెలియవు. అవి బయటకురాలేదు. ఏం జరిగినప్పటికీ రమణయ్య మాత్రం ఆస్తి విషయమై ఏం మాట్లాడిఉండడు. ఎటొచ్చీ తల్లిప్రాణం కనుక ఆవిడే ఏదో అని వుంటుంది. కాని శ్యామల భర్తతోటి, అత్తమామలతోటి ఆ విషయవ సూటిగా అడుగుతుందనే దాంట్లో నాకు అట్టే నమ్మకం చిక్కటంలేదు. ఎందుకంటే శ్యామల మనస్తత్వం నాకు తెలియందికాదు. ఆ పిల్ల ఆదిగారాబంగా పెంచుకొనే తల్లిదండ్రులనే ఎదిరించి ఒక్కమాట అనదు. గులాబి పువ్వుకంటె అతికోమలంగా ఉంటుంది, ఆ పిల్ల హృదయం.

రమణయ్య ఇంకా బజారు ముఖం చూడటం లేదు. నేరస్థుడిలాగా అట్లా ఇంట్లో పాతుకుపోవడం నాకు రమణయ్య దుఃఖాన్ని ఆరాధిస్తూన్నట్టు కనపడింది.

ఒకరోజు మధ్యాహ్నం తీరికచేసుకొని రమణయ్య ఇంటికి వెళ్ళాను.

"ఏం రమణయ్యా! ఇంకా బజారుకు వొచ్చి మటుకు వెలగబెట్టాల్సిన రాజకీయాలేమున్నాయి" అన్నాడు, ముక్తసరిగా.

అల్లుడు వెంకట్రావుకూ, నాకూ, నాకూ జరిగిన సమావేశపు విశేషాలు, చివరకు తను అవలంభించిన మధ్యవర్తిత్వమూ రమణయ్యకు చెబుదామా, వొద్దా అనే సంఘర్షణ నాలో రేగింది. ఆ సంఘర్షణ ఫలితం ఏమంటే: నేను చెప్పవొద్దనే నిర్ణయానికి రావటమే ఆయన తను చెప్పటంచేత మధ్యవర్తిత్వం చేస్తున్నానని అల్లుడు భావిస్తాడేమోనని అనుకొంటాడని అనుమానం కలిగింది. ఇంకొకటి ఏమిటంటే, తన కుటుంబ విషయాల్లో మరొకడు జోక్యం కలుగచేసుకొని సమస్యల్ని పరిష్కరించ పూనుకోవడం రమణయ్యకు ఇష్టంలేదు. కనుక నేను వెంకట్రావుతో జరిపిన మధ్యవర్తిత్వం ఏమాత్రమూ చెప్పదలుచుకోలేదు. అయితే నేను ఒకటి తలచకపోలేదు. అది నా స్వార్థమే కానీయండి: నా మధ్యవర్తిత్వం ఫలించిన తరువాత రమణయ్యతో మాటల సందర్భంగా చెబుదామని.

రమణయ్య భార్యతో అన్నాను "పిల్లవాడి ఆరోగ్యం ఎట్లా ఉందమ్మా!"

"బాగానేఉంది. కాని నిన్నటినుంచి కొంచం ఒళ్లు వేడిగాఉంటూన్నదన్నయ్యా!" అన్నదామె.

"దానిదాముందిలే. అయినా డాక్టర్ని ..." నడిగాను.

"ఇంతమాత్రానికే ... డాక్టరెందుకూ!" అన్నాడు రమణయ్య.

"మొన్న అమ్మాయి వచ్చిందికాబోలు" అన్నాను రమణయ్య భార్య కేసిచూస్తూ, నేను ఈవాక్యం అనటంలోని గూఢార్థం వాళ్ళకి అర్థమైనట్టులేదు. అర్థమై మెదలకుండా వూరుకున్నారో తెలీదు. మొత్తానికి నే నాశించిన విధంగా వాళ్ళు అమ్మాయితో జరిపిన సంభాషణల విశేషాన్ని నాకు చెప్పలేదు.

"వచ్చింది" అనిమాత్రమే అని వూరుకుంది, రమణయ్య భార్య. "అక్కడ భర్త, అత్తమామలు ఏమనుకొంటూన్నది అడిగారా అమ్మాయిని" అని ఆమెను అడిగే చనువునాకున్నమాట యదార్థమే కాని ఎందుచేతనో అట్లా అడగటం భావ్యంగా ఉండదేమో ననిపించింది, నిజం చెప్పొద్దూ.

* * *

ఒక పాతస్నేహితునికి ఉత్తరం వ్రాద్దామనే

ఉద్దేశం కలిగి ఉత్తరాలకట్టను ముందు వేసుక్కూచుని అడ్రసుకోసం వెతుకుతున్నాను. మధ్యాహ్నము రెండుగంటలైఉంటుంది. ఎండప్రభావం అతిగా ఉందనే చెప్పాలి.

ఇంతలో బయట తలుపు చప్పుడైంది. తలుపు తీశాను.

రమణయ్య ప్రత్యక్షమయ్యాడు. నేను ఆశ్చర్యానికి గురికాక తప్పలేదు. రమణయ్య మా యింటికి రావటం కొత్తకాదు. అయినా ఆస్థితిలో రమణయ్య మా యింటికి రావటం నాకు ఆశ్చర్యాన్ని తెచ్చిపెట్టటం ఒకటీన్నూ, రెండోది ఎంత ఆపదలో చిక్కుల్లో ఉన్నాడోఅనే అనుమానం ఉద్భవించటమున్నూ.

రమణయ్యను ఇంట్లోకి తీసుకెళ్ళి కుర్చీలో కూర్చొపెట్టాను. "ఏమిటి, విశేషం" అన్నాను ఒక నిముషం విరామం గడిచింతరువాత.

బుజంమీది తుండుగులాక్కొని చెమట తుడుచుకుంటూ అన్నాడు రమణయ్య.

"ప్రొద్దున మా అమ్మాయి వొచ్చింది"

ఆరావటంలో ఏదో ముఖ్యమైన కార్యముంటుందని సులభంగా తలచాను.

"మొన్న నే వొచ్చి వెళ్ళిందిగా! మళ్ళా ఇంత తొందరలో ఎందుకు వొచ్చినట్టు. పిల్లవాడికి కాస్త జబ్బు చేసిందని, చూసిపోదామని వొచ్చిందా" అన్నాను గుక్క తిప్పుకోకుండా

"కాదు"

నా అనుమానం నిజమైంది. నా మధ్యవర్తిత్వంయొక్క ప్రభావం తెలియ వొచ్చిందన్నమాట. అల్లుడు పంపించి ఉంటాడు. సందేహం ఎందుకు?

"మరెందుకు?" అన్నాను.

"వెంకట్రావు పంపించాడు. మూడెంతుల పొలం నాకు వ్రాసి యిస్తాడట" అన్నాడు రమణయ్య.

నా మధ్యవర్తిత్వం ఫలించింది. నా మాటల మీద గౌరవమున్న మనుష్యులు ఉన్నారు. కాని రమణయ్య వాలకాన్ని పరిశీలిస్తే ఈ సంతోషపు వార్త నాకు చెప్పేందుకు వొచ్చినట్టు లేదు. ముఖం గంభీరంగా ఉంది. నేను మధ్యవర్తిత్వం అవలంభించినట్టు అల్లుడు కూతురుకు చెపితే కూతురు తండ్రికి చెబితే ఆయన నన్ను దూషణంగా అడిగేందుకు వొచ్చేడేమోనన్న సందేహం ఆ క్షణం కలిగింది.

"అయితే నీ అభిప్రాయ మేమిటి?"

"నాకు ఇష్టంలేదు."

కాని నేను సందేహించినట్టు జరిగిఉండలేదు. రమణయ్య పాతఅభిప్రాయాన్నే కలిగిఉన్నాడు. ఆయనలో ఆమూఢత్వాన్ని తొలగించాలి.

"రమణయ్యా! నీకెందుకు నువ్వునోరుమూసుకొని ఊరుకో. మీ ఆవిడ చక్కబెట్టుకుందిలే. మరీ ఇంత పిచ్చివాడివైపోతే ఎట్లా? నీకు తెలియకపోతే నాబోటివాళ్ళ సలహాయైనావిను. నువ్వు ఎందుకు అనవసరంగా ఈలోకానికి భయపడతావు. పాతధర్మాల ప్రకారం నడవాలని చూస్తావు. నువ్వుయివ్వాళ దేన్నయితే గౌరవహీనమని భావిస్తున్నావో ఆపనే మరొకడుచేస్తే గౌరవం తప్పనిసరి అనేవాళ్ళు ఉంటారు. ఎందుకుకాని వ్రాసియిస్తానంటే ఆ పొలం స్వీకరించు."

రమణయ్య ఏం మాట్లాడలేదు. ఇంటికి వెళ్లాడు భార్య ఇదేధోరణిలో వాదించింది. చివరకు రమణయ్యకు ఒప్పుకోక తప్పలేదు.

భర్త రెండురోజుల్లో వొస్తాడని శ్యామల నాకుచెప్పింది. విషయాలు తీరిగ్గా మాట్లాడుకోవచ్చని తలచాం నేనూ, రమణయ్యా.

నా మధ్యవర్తిత్వం రమణయ్యకు ఎంతగానో సహాయం చేసిందనీ. కొత్తగా పుట్టిన కొడిక్కి భవిష్యత్తులో ఆస్తిని గురించి చింత లేకండా చేసిందనీ, మామా అల్లుళ్ళ గౌరవాలకు లోపం రాకండా సమస్యాపరిష్కారం చేసిందనీ, నాకు మధవర్తిత్వలో తగిన నేర్పు ఉందనీ మీరు అనుకోవచ్చు, కాని తీరా పరిస్థితులు చక్కబడే సమయంలో ఏం జరిగిందంటే, నామధ్యవర్తిత్వానికి విలువ లేకుండాపోయింది.

పాపం! కొత్తగా పుట్టిన ఆ పిల్లవాడికి భూమి మీద గింజలుతినే రాతలేదు. మనంఎన్ని అనుకొని, ఏంచేసి మాత్రం-ఏంలాభం? రాగూడదని రోగం వొచ్చి ఆ పసికందు పుట్టిన నెలరోజులకే చనిపోయాడు.